# ఏవమగోత్ర

"మీ పేరు?" అడిగాడు అతను.

"మిస్ దేవయాని" అన్నది ఆమె. మిస్ అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ; అతను ఆ గదిని పరీక్షగా చూశాడు.

ఒక మూలగా నవ్వారు మంచం, ప్రక్కనే చిన్న బట్టల స్టాండ్, కిటికీలో అద్దం, దువ్వెన తప్ప మరేమి లేదు ఆ గదిలో, ఆమె వెలిసిపోయిన సిఫాన్ చీర కట్టుకుని ఒద్దికగా నిలబడి వున్నది. "మీకు అభ్యంతరం లేకపోతే నాతో వస్తారా!" అన్నాడు అతను.

"ఎక్కడికి?" దేవయాని.

"మా ఇంటికి"— "మీ ఇంటికా?". 'అవును మా ఇంటికే నా పేరు శర్మ. నేను ఇక్కడి పి.డబ్ల్యు.డిలో ఇంజనీర్ గా పని చేస్తున్నాను. నా భార్య పురిటికి పుట్టింటికి వెళ్ళింది. ఇక్కడికి మా ఇల్లు దగ్గరే!" అన్నాడు అతను.

"సరే వస్తాను" అని ఆమె బయలు దేరటానికి వుద్యుక్తురాలయింది.

ఆమె గదికి తాళం వేశాక అతను స్కూటర్ కిక్ కొట్టి స్టార్ట్ చేశాడు. స్కూటర్ మెయిన్ రోడ్ మీదకు వచ్చి కుడిపక్క సందులో వున్న మొదటి డాబా ఇంటి ముందు ఆగింది. అతను తాళం తీసి "రండి" అంటూ ఆమెని ఆహ్వానించాడు.

ముందు వున్న డ్రాయింగ్ రూం కళాత్మకంగా ఖరీదైన ఫర్నిచర్ తో అందంగా తీర్చిదిద్ది వుంది. ఆమె చూపులు ఒక కార్నర్ లో వున్న మల్లెకుండీల పైన పడింది. చాలా చిన్న కుండీల్లో చిన్న చెట్లు, చెట్టునిండా అరవిరిసిన మల్లెమొగ్గలు. ఆమె దృష్టి అటువైపు పడటం చూసి అతను "అదంతా మా శ్రీమతి టేస్టు. మొక్కలంటే ఆవిడకి పిచ్చి. డబ్బంతా మొక్కల కోసం తగలేస్తుంది" అన్నాడు.

"ఇల్లు చూస్తావా!" అంటూ లోపలి గదుల్లోకి తీసుకు వెళ్ళాడు అతను. ఇల్లంతా ఎంతో నీట్ గా అడుగు వేస్తే మాసిపోయింనేమో అన్నట్లు వుంది. ఇంటి ఇల్లాలు ఇప్పుడే పని ముగించుకుని అవతలికి వెళ్ళిందా అన్నట్లు వుంది. "మీ శ్రీమతి లేకపోయినా మీరు ఇల్లు బాగా మెయిన్ టైన్ చేస్తున్నారే!" అన్నది ఆమె.

"ఏం చేస్తాం. తప్పదుగా ఎక్కడి వస్తువులు అక్కడ నీట్ గాలేకపోతే ఆమెకి ఇష్టంవుండదు" శర్మ.

అతను ఫ్రిజ్ లోంచి చికెన్ ఫ్రై తీసి గ్యాస్ మీద వేడి చూశాడు. ఎగ్స్ తీసి ఆమ్లెట్ వేశాడు. ఆటోమెటిక్ రైస్ కుక్కర్ లో అన్నం వేడిగా వుంది. ఫ్రిజ్ లోంచి పెరుగు, స్వీట్స్ తీసాడు. అన్నీ టేబుల్ మీద అమర్చి ఆమెను భోజనానికి ఆహ్వానించాడు.

ఆమె మృదువుగా తిరస్కరించింది. టేబుల్ మీద వున్న వంటకాలను చూసి "నేను బ్రహ్మిన్ ని ప్యూర్ వెజిటేరియన్ ని" అన్నది. పక్కలో బాంబు పడినట్లు, అతను అదిరిపోయాడు.

"నీవు బ్రహ్మిన్ వా! అయితే ఈ వృత్తి..." అంటు అర్ధోక్తితో ఆగిపోయాడు.

"ఈ వృత్తికి కులం స్పెషల్ గా కావాలా! ఈ వృత్తికి కారణం ఆకలి. దానిని తీర్చుకోవడం కోసమే ఈ వృత్తి" అన్నది ఆమె మెల్లగా.

"నాది ఆకలి కులం—"

"అయినా..." అంటూ అతను చిదరగా ముఖం పెట్టాడు.

"నీ వృత్తి ఇంజనీర్ కావచ్చు. నేను ఆకలి



సూర్యదేవర శశికుమార్




గురించి నా మీద ఆధారపడి వున్న వారి గురించి ఈ వృత్తి వేస్తున్నాను.''

''నన్ను వేశ్య అన్నారు. మరి నీవు నా దగ్గరికి ఎందుకు వచ్చావు? నిన్ను వేశ్యుడు అనాలా ఒక్కరోజు పెళ్ళాం పక్కలో లేకపోతే నీవు బజార్న పడ్డావు కామంతో— కన్ను మిన్ను తెలియని కామంతో మరి నీదే కులం!''

అన్నిటికన్నా అతన్ని ఆశ్చర్య పరిచిన సంగతి ఏమిటంటే ఆమె ఇదంతా స్వచ్ఛమైన ఇంగ్లీష్‌లో తడబాటు లేకుండా మాట్లాడింది. అటువంటి ఇంగ్లీషు చిన్నప్పటి నుంచి ఖరీదైన కాన్వెంట్‌లో చదివిన వారే మాట్లాడగలరు. అతను ఆశ్చర్యాన్నుంచి తేరుకుంటూ— ''ఎంతవరకు చదువుకున్నావు?'' అని అడిగాడు.

''జీవితాన్ని చాలా చదివాను. డిగ్రీ అయింది—'' ఆమె ''యూనివర్సిటీ ఫస్ట్'' అన్నది చాలా మామూలుగా.

''అలాంటప్పుడు వుద్యోగం చూసుకోవచ్చుగా'' అన్నాడు అతను. రుమాలు కొనుక్కోవచ్చు గదా అన్నంత తేలికగా.

''భోజనం కానివ్వు. తర్వాత నా హిస్టరీ చెపుతాను'' అంటూ ఆమె ముందు హాల్లోకి వెళ్ళి పేపరు తిరగేస్తు కూర్చుంది.

అతను భోంచేసి ఫ్రిజ్‌లోంచి పాలు తీసి కాఫి తయారు చేసి ఆమెకు ఇచ్చాడు. ఆమె చెప్పటం ప్రారంభించింది.

''మేము మొదటి నుంచి ఆస్తిపరులమే. మా నాన్నగారు నెల్లూరులో తహసీల్దారుగా వుండేవారు. అంతా సక్రమంగా వుంటే ఆయన సర్వీస్ ప్రకారం ఈ పాటికి జిల్లా కలెక్టరుగా వుండేవారు. నేనూ ఇంకో జిల్లా కలెక్టర్ భార్యగా గౌరవంగా వుండేదాన్నేమో!

మా నాన్నగారికి నాటకాల పిచ్చి వుండేది. ఆ పిచ్చితో కళావాహిని అనే నాటక సమాజం స్థాపించి తరువాత వుద్యోగానికి రాజీనామా ఇచ్చారు.

మా ఇంట్లో మొదటి నుండి వచ్చీపోయే వారితో, పెళ్ళి వారిల్లులా వుండేది. సంగీత గాన సభ్యులతో అలరారుతుండేది.

ఆదాయం తగ్గినా ఖర్చు తగ్గలేదు. ఇంటి ఖర్చుకు తోడు, నాటక సమాజం ఖర్చు— ఆర్థికంగా దిగజారిపోయాము

ఆదాయం తగ్గితే ఖర్చు తగ్గించుకోని వ్యక్తి తెలివి తక్కువ వ్యక్తి. అటువంటి తెలివి తక్కువ వాళ్ళలో మొదటివాడు మానాన్న. అప్పులు పెరగడం ఆస్తి తరగటం ఒకేసారి జరిగింది.